నమస్తే తెలంగాణ

మెదక్

I | హైదరాబాద్, శనివారం 31 ఆగస్టు 2024 | MEDAK

- అవినీతి మయంగా ప్రాథమిక సహకార సంఘాలు
- మెదక్ జిల్లాలో బయటపడుతున్న అక్రమాలు
- టేక్మాల్ సొసైటీలో రూ.24 లక్షల గోల్‌మాల్..?
- ఇబ్రహీంపూర్ సొసైటీలో అక్రమాలపై కొనసాగుతున్న విచారణ
- విచారణ పేరుతో కాలయాపన చేస్తున్న సహకార శాఖ
- కలెక్టర్ దృష్టిపెట్టాలని రైతుల విన్నపం

అక్రమాల్లో సొసైటీలు..!

మెదక్ జిల్లా టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

మెదక్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లాలో ప్రాథమిక సహకార సంఘాలు (పీఏసీఎస్‌లు) అవినీతి, అక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయి. రైతులకు చేయూతనివ్వాల్సిన పీఏసీఎస్‌లు వారిని దోచుకుంటున్నాయి. ఉన్నతాధికారులు సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నది. చేగుంట మండలం ఇబ్రహీంపూర్ పీఏసీఎస్‌లో ఇటీవల భారీ అవినీతి వెలుగుచూసింది. టేక్మాల్ పీఏసీఎస్‌లో చైర్మన్‌తో పాటు సీఈవో పై ఆరోపణలు వచ్చాయి. చెప్పుకుంటూ పోతా చాలా సొసైటీల్లో ఇదే పరిస్థితి ఉందనే ఆరోపణలు ఉన్నాయి. టేక్మాల్ సొసైటీలో భూ కొనుగోలుకు సంబంధించి రూ.27 లక్షలు గోల్‌మాల్ అయినట్లు తెలిసింది. చేగుంట మండలం ఇబ్రహీంపూర్ పీఏసీఎస్‌లో ఫర్టిలైజర్స్, గన్నీ బస్తాల్లో భారీగా అవినీతి జరిగినట్లు తెలిసింది. మూడు నెలల వ్యవధిలోనే ఫర్టిలైజర్‌కు సంబంధించి రూ.14 లక్షలు స్వాహా కాగా, గన్నీ బస్తాలకు సంబంధించి రూ.25 లక్షల వరకు గోల్‌మాల్ జరిగింది. ఇబ్రహీంపూర్ సొసైటీ పరిధిలో 23 గ్రామాలు ఉన్నాయి. వీటి కింద 3675 మంది రైతులు ఉన్నారు. ఈ సొసైటీలో పెద్ద మొత్తంలో స్కాం జరిగింది. సొసైటీలో చైర్మన్, సీఈవోలు ఉండగా సొసైటీ సెక్రటరీ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. ఏటా ఆడిట్ జరిగే సమయంలో విచారణకు వచ్చే అధికారికి మామూళ్లు ఇచ్చి అన్నీ సక్రమంగా ఉన్నట్లు రిపోర్టు ఇప్పించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పీఏసీఎస్‌లో సమావేశాలు జరిగిన సందర్భంలో గోవా టూరు, జల్సాలకు భారీగా ఖర్చు చేసినట్లు తెలిసింది. రైతులకు సంబంధించిన క్రాప్ లోన్ విషయంలోనూ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.

రూ.24 లక్షలు ఏమయ్యాయి..?

మెదక్ జిల్లా టేక్మాల్ పీఏసీఎస్‌కు 2.12 గుంటల భూమిని కొందరు రైతులు సొసైటీకి దానం ఇచ్చారు. కాగా, ఈ భూమికోసం ఈ సొసైటీలో రూ.27.85 లక్షలకు విక్రయించినట్లు చైర్మన్, సీఈవో కమిటీ తీర్మానాలు చేసుకున్నారు. ఇందులో రూ.3 లక్షలు రైతులకు చెల్లించినట్లు, మరో రూ.1.62 లక్షలు స్థలం రిజిస్ట్రేషన్ కోసం చలాన్ కట్టినట్లు తెలిసింది. ఈ మేరకు 2018లో టేక్మాల్ సొసైటీ సీఈవో పేరు మీద భూమి రిజిస్ట్రేషన్ అయ్యింది. భూమిని ఇచ్చిన రైతులకు రూ.3 లక్షలు చెల్లించగా, రూ.27.84 లక్షలకు భూమిని కొన్నట్లు రిజిస్ట్రర్ డాక్యుమెంట్‌లో రాశారు. దీంతో సొసైటీలో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు తెలుస్తోంది. టేక్మాల్ మండలం ధన్నారంలో 2020లో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లో కూడా అక్రమాలు జరిగినట్లు తెలిసింది. ఈ బంక్ కోసం 25 సంవత్సరాలకు లీజుకు తీసుకొని నెలకు రూ.10వేలు అద్దెను చెల్లించినట్లు తెలిసింది. ఈ బంక్‌ను ఆరు నెలల వరకు నడిపించి ఆ తర్వాత మూసివేశారు. ఇందులో కూడా రూ.13 లక్షలు నష్టం వచ్చినట్లు సొసైటీ చైర్మన్, సీఈవోలు చూపించారు. విచారణ జరిపితే టేక్మాల్ సొసైటీలో జరిగిన అవినీతి బయటపడే అవకాశం ఉంది. ఇబ్రహీంపూర్, టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో జరిగిన అవినీతిపై మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ దృష్టిపెట్టాలని రైతులు కోరుతున్నారు. ఇంత అవినీతి జరుగుతున్నా ఇప్పటి వరకు ఆడిట్ అధికారులు రిపోర్ట్ ఇవ్వలేదు. సొసైటీలపై విచారణ జరపాల్సిన సంబంధిత శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కలెక్టర్ స్పందించి సమగ్ర దర్యాప్తు జరిపి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చైర్మన్, సీఈవోలదే బాధ్యత...

సొసైటీల్లో అవినీతి జరిగితే దానికి సొసైటీ చైర్మన్, సీఈవోలదే బాధ్యత. సొసైటీలో ప్రతి ఖర్చు కోసం చైర్మన్, సీఈవోల జాయింట్ అకౌంట్‌లో నుంచే డబ్బులను డ్రా చేస్తారు. టేక్మాల్, ఇబ్రహీంపూర్ సొసైటీలో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతుంది. మెదక్ ఆర్డీవో సమక్షంలో టేక్మాల్ సొసైటీపై విచారణ జరుగుతున్నది. వీటిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

–కరుణ, జిల్లా సహకార అధికారి, మెదక్ జిల్లా

శివ్వంపేట రైతువేదికలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హామీల అమలుకు కాంగ్రెస్ సర్కారుపై పోరు

- రుణమాఫీ కాక రైతుల ఆందోళన
- బీటీరోడ్లకు మంజూరైన రూ. 4.50 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- శివ్వంపేటలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

శివ్వంపేట, ఆగస్టు 30 : సంపూర్ణ రుణమాఫీ, ఆరు గ్యారంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శివ్వంపేటలో శుక్రవారం 51 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో మండలానికి 51 సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం 9నెలలు పెండింగ్‌లో పెట్టడం దుర్మార్గమన్నారు. చెక్కుల మంజూరు కోసం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళితే గానీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇంకా దాదాపు 500 వరకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి మంజూరుకు సైతం కృషి చేస్తానన్నారు. 9నెలల కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఏకకాలంలో చేస్తామన్న రుణమాఫీ కేవలం 40శాతం మాత్రమే అయిందని, రుణమాఫీ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమానికి కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పకున్నా అనేక పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుభరోసా, రుణమాఫీ, 24గంటల విద్యుత్ ఇవ్వకుండా నిలువునా మోసం చేస్తున్నదని మండిపడ్డారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించిందని, బ్లీచింగ్ పౌడర్ వేయడానికి కూడా జీపీల్లో డబ్బులు లేవన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథను విఫల పథకంగా చూపెట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఇంత ఘోరమైన ఫెయిల్యూర్ ప్రభుత్వాన్ని ఇప్పటి వరకు చూడలేదన్నారు. శివ్వంపేట మండలంలోని తండాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అల్లీపూర్ తండా నుంచి ఫకీరాతండా వరకు రూ. కోటి 26లక్షలు, రత్నాపూర్ నుంచి చర్చితండా వరకు 70 లక్షలు, శివ్వంపేట హనుమాన్‌నగర్ నుంచి శంకర్‌తండా వరకు రూ. 2కోట్ల50 లక్షలు, మొత్తం నాలుగున్నర కోట్లను విడుదల చేస్తే, ఆ నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆపి అభివృద్ధిని అడ్డుకుంటుందని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ఎఫ్ చెక్కులు, తండాల బీటీరోడ్లకు మంజూరైన నిధులు ఇప్పించాలని ఆమె సవాల్ విసిరారు. అందరం కష్టపడి బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేద్దామని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణాగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ పబ్బమ హేశ్‌గుప్తా, మాజీ జడ్పీకోఆప్షన్ మస్సూర్, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, రైతు సమన్వయసమితి మండలాధ్యక్షులు నాగేశ్వర్‌రావు, సీనియర్ నాయకులు యాదాగౌడ్, మహిపాల్‌రెడ్డి, చింతస్వామి, రాజశేఖర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గౌరవెల్లి ప్రాజెక్ట్‌ను పరిశీలించిన కలెక్టర్

గౌరవెల్లి ప్రాజెక్ట్ పరిసరాలను పరిశీలిస్తున్న సిద్దిపేట కల్టెకర్ మనుచౌదరి

అక్కన్నపేట, ఆగస్టు 30: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్ట్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ మనుచౌదరి సందర్శించారు. ప్రాజెక్ట్ కట్టపై ఎన్‌జీటీ బిగించిన సీసీ కెమెరాలు ఇటీవల అపహరణ గురికావడంతో ఆరాతీశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్ట్ తుది దశ పనులకు ఇటీవల రూ. 436 కోట్లు మంజూరు చేసిన నేపథ్యంలో పెండింగ్ పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మత్స్య పారిశ్రామిక శాఖ ఆధ్వర్యంలో ప్రాజెక్టులో చేపల పెంపకం గురించి ప్రతిపాదనలు మత్స్య పారిశ్రామిక కమిషనర్ ప్రియాంకతో కలిసి చర్చించినట్లు తెలిసింది. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, అక్కన్నపేట తహసీల్దార్ అనంత్‌రెడ్డి, రెవెన్యూ, ఇరిగేషన్, మత్స్య శాఖల అధికారులు, ఉన్నారు.

చేనేత కుటుంబంలో విషాదం

తుమ్మ నవీన్ మృతదేహం

దుబ్బాక,ఆగస్టు 30 : సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఓ చేనేత కుటుంబంలో విషాదం నెలకొంది. దుబ్బాక పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీలో నివసిస్తున్న చేనేత కార్మికుడు తుమ్మ రాజలింగం–సత్యవతి దంపతుల కుమారుడు తుమ్మ నవీన్ శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. తుమ్మ నవీన్ (29) సిద్దిపేటలో ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాడు. నవీన్‌కు సిద్దిపేటకు చెందిన ప్రజ్ఞా అనే యువతితో నాలుగేండ్ల కిందట వివాహం జరిగింది. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో నవీన్ తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నారు.

సంగారెడ్డిలో నిర్వహించిన సమక్షలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ఎస్సీ, ఎస్టీల కేసులు పరిష్కరించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 30: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులను సెప్టెంబర్ నెలాఖరులోగా పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సంగారెడ్డి జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్, ఎస్పీలతో కలిసి పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు, ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల నాయకులతో ఎస్సీ, ఎస్టీల కేసులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. పెండింగ్ ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించిన పోలీసు, రెవెన్యూ శాఖ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రెండ్లీ పోలీస్‌లో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా పోలీసు సిబ్బంది పనిచేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలలను వసతి గృహాలను అధికారులు తరుచుగా తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన విద్య అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వల్లూరు క్రాంతి కమిషన్ చైర్మన్‌కు వివరించారు. భూ సమస్యలపై ఆర్డీవోలతో విచారణ చేయించి, వారికి న్యాయం జరిగేలా చూస్తున్నామని తెలిపారు. వసతి గృహాలను విధిగా తనిఖీలు చేస్తున్నామని, అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి జిల్లాలో పోలీస్‌శాఖ తరపున చేపట్టిన కార్యక్రమాలను ఎస్పీ రూపేశ్ కమిషన్ చైర్మన్‌కు వివరించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, నీలాదేవి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి అఖిలేష్‌రెడ్డి, డీవీఎంఎస్ సభ్యులు, అధికారులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇస్నాపూర్ గురుకులం పరిశీలన

పటాన్‌చెరు, ఆగస్టు 30: సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరిశీలించారు. వంటశాలకు వెళ్లి డిన్నర్ కోసం వండిన ఆహారాన్ని తనిఖీ చేశారు. ఆహారం ఎలా ఉంటున్నదని విద్యార్థులను అడిగారు. జిమ్‌ను సందర్శించి స్వయంగా వ్యాయామం చేశారు. విద్యాబోధన ఎలా ఉన్నదని, వసతులు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రెసివ్ పేరెంట్స్ లీగ్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పత్రి లలితారాణి విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు బ్రహ్మకుమారీస్ సంస్థతో సైకియాట్రిస్ట్ బోధన ఒప్పందం చేసుకున్నారని ఆ ఒప్పందం రద్దు చేయాలని బక్కి వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బంకి వెంకటయ్య మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని జిల్లాల్లో గురుకులాలను పరిశీలించి లోటుపాట్లు గుర్తించి రిపోర్టు తయారు చేయమన్నారన్నారు. కాలుష్య సమస్య తీవ్రంగా ఉన్నదని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నదని గుర్తించి పీసీబీశాఖకు లెటర్ రాసి కాలుష్యాన్ని నివారించేలా చూస్తామన్నారు. ముళ్లపొదలు, కంపచెట్లు, మురుగు తొలిగించేలా ఎంపీడీవోకు ఆదేశాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, నీలాదేవి, రేనికుంట్ల ప్రవీణ్, శంకర్, నేనావత్ రాంబాబునాయక్, డిప్యూటీ డైరెక్టర్ అఖిలేశ్‌రెడ్డి, సీఐ ప్రవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో విద్యార్థుల ఆహారాన్ని పరిశీలిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కివెంకటయ్య తదితరులు

టూరిజం స్పాట్‌గా ఎల్లమ్మ చెరువు అభివృద్ధి

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఎల్లమ్మచెరువు కట్ట అభివృద్ధి పనులు, మినీ స్టేడియం హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- ప్రణాళికాబద్ధంగా హుస్నాబాద్ పట్టణాభివృద్ధికి కృషి
- చేనేత కార్మికులను ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

హుస్నాబాద్, ఆగస్టు 30: హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా రూపుదిద్దేందుకు కృషిచేస్తున్నామని, ఉత్తర తెలంగాణకే తలమానికంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్‌లో రూ.45లక్షలతో నిర్మించే పద్మశాలీ సేవాసంఘం కమ్యూనిటీ భవనం, రూ.85లక్షలతో ఎల్లమ్మ చెరువు కట్ట అభివృద్ధి పనులకు, రూ.20లక్షలతో సిద్దేశ్వర గుడి వరకు రోడ్డు నిర్మాణ పనులకు, తన తండ్రి స్మారకార్థం ఎల్లమ్మ ఆలయ ఆవరణలో వసతి మండప నిర్మాణాలకు శుక్రవారం కలెక్టర్ మనుచౌదరితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అంతకు ముందు పీఏసీఎస్ నూతన కార్యాలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో మంత్రి మాట్లాడుతూ.. హుస్నాబాద్ పట్టణంలో గతంలో జరిగిన అభివృద్ధితో పాటు ఇంకా అభివృద్ధి చేసేలా ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు పోతామన్నారు. మడేలయ్య దేవాలయం, మున్నూరు కాపు సంఘం భవనం, రెడ్డి సంఘం భవనం, ముదిరాజ్ సంఘం భవనం, మైనార్టీ, హమాలీ సంఘాల భవనాలకు ఒక్కోదానికి రూ.45లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. మల్లెచెట్టు చౌరస్తా నుంచి ఎల్లమ్మ చెరువు వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్, ఏసీపీ కార్యాలయాలు, మాతాశిశు దవాఖాన భవనాలను త్వరలోనే ప్రారంభించుకుంటామని చెప్పారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, చేనేత కార్మికుల పెండింగ్ నిధులను విడుదల చేసిందన్నారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా మరిన్ని పథకాలను ప్రభుత్వం అమలు చేయబోతున్నదని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు అధికారులు పాల్గొన్నారు.

డెంగీ బారినపడి ఇద్దరు మృతి

సిద్దిపేట జిల్లాలో వివాహిత.. మెదక్ జిల్లాలో విద్యార్థి మృతి

సుతారి కనకలక్ష్మి, హర్షిత్‌చారి (ఫైల్)

సిద్దిపేట అర్బన్/పాపన్నపేట, ఆగస్టు 30: ఉమ్మడి మెదక్ జిల్లాలో డెంగీ మరణాలు పెరుగుతున్నాయి. శుక్రవారం సిద్దిపేట జిల్లా తడ్కపల్లిలో డెంగీతో వివాహిత మృతిచెందింది. తడ్కపల్లినికి చెందిన సుతారి కనకలక్ష్మి(28) రెండు నెలల కింద డెంగీ బారిన పడటంతో సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానలో పదిరోజుల పాటు చికిత్స అందించారు. అయినా జ్వరం తగ్గక పోవడంతో హైదరాబాద్‌లోని పలు ప్రైవేట్ దవాఖానల్లో వైద్యం చేయించారు. ఆమె వైద్యానికి కుటుంబం రూ.25 లక్షలకు పైగా అప్పు చేయాల్సి వచ్చింది. అయినా ప్రాణం దక్కలేదు.ఆరోగ్యం విషమించి గురువారం రాత్రి ఆమె మృతిచెందారు. మృతురాలికి భర్త నర్సింలు, సాత్విక్(9), చేతన్(7) అనే ఇద్దరులు కుమారులు ఉన్నారు.

మెదక్ జిల్లాలో విద్యార్థి మృతి

మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని చీకోడ్‌లో శుక్రవారం డెంగీతో విద్యార్థి మృతిచెందాడు. చీకోడ్ గ్రామానికి చెందిన వడ్ల రాజు పెద్ద కొడుకు హర్షిత్ చారి (11) స్థానిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. వారం కిత్రం డెంగీ బారినపడగా మెదక్‌లో చిక్సిత అందించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం రాత్రి మరణించాడు. పాపన్నపేట మండలంలో విష జ్వరాలు, డెంగీ కేసులు నమోదవుతున్నా వైద్యసిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గోవింద్ నాయక్ ,శ్రీనివాస్ ఆరోపించారు. వారు శుక్రవారం బాధిత విద్యార్థి ఇంటికి వెళ్లి కుటుంబం సభ్యులను పరామర్శించారు. మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవడానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

పుట్టిన రోజే.. ఆ ఇల్లాలుకు చివరిరోజు

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం గంభీర్‌పూర్‌లో గృహిణి ఆత్మహత్య

దుబ్బాక, ఆగస్టు 30 : పుట్టినరోజు ఆ ఇల్లాలుకు చివరి రోజుగా మారింది. పుట్టిన రోజున అత్తగారింట్లో ఉదయం నుంచి సరదాగా ఉన్న ఆ మహిళ మధ్యాహ్నం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడంపై పలు అనుమానాలు తావిస్తున్నాయి. వివరాలు.. దుబ్బాక మండలం గంభీర్‌పూర్‌కు చెందిన రెడ్డి సాగర్‌రెడ్డికి సిద్దిపేట మండలం లింగారెడ్డిపల్లికి చెందిన రవళి(25) అనే యువతితో ఐదేండ్ల కిందట వివాహం జరిగింది. వీరికి రుత్విక్‌రెడ్డి, అక్షయ్‌రెడ్డి ఇద్దరు కుమారులు సంతానం. సాగర్‌రెడ్డికి వ్యవసాయం ఉన్నప్పటికీ సిద్దిపేటలో ఓ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం అత్తగారింట్లో రవళి తన పుట్టినరోజును సంతోషంగా జరుపుకోవాలనుకుంది. సిద్దిపేటకు వెళ్తున్న భర్త సాగర్‌రెడ్డికి డ్యూటీ నుంచి తిరిగి వచ్చే సమయంలో కేక్ తీసుకురమ్మని చెప్పింది. రవళి పెద్ద కొడుకు రుత్విక్‌రెడ్డిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపించి, అక్కడ అన్నం తినిపించి ఇంటికి వచ్చింది. మధ్యాహ్నం తన అత్త ఉమను కిరాణా సామగ్రి, ఇతర వస్తువులను తీసుకురమ్మని దుబ్బాకకు పంపించింది. మామ మల్లారెడ్డి వ్యవసాయ పనులకు పొలం వద్దకు వెళ్లాడు. ఏడాదిన్నర వయసున్న చిన్న కొడుకు అక్షయ్‌రెడ్డితో కలిసి రవళి ఇంట్లోనే ఉంది. కొద్ది సమయానికి చిన్న కొడకు అక్షయ్‌రెడ్డి ఏడుస్తూ ఇంటి బయకు రావడంతో ఇంటి పక్కనున్నవారు వారి ఇంట్లోకి వచ్చి చూడగా...దూలానికి ఉరివేసుకుని రవళి మృతదేహం కనిపించింది. రవళి ఆత్మహత్య చేసుకోవాల్సిన ఇబ్బందులు లేవని, ఎందుకు ఆత్మహత్య చేసుకుందో తెలియడం లేదని కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడానికి ఉదయం నుంచి సంతోషంగా ఉన్నా రవళి ఇలా ఆత్మహత్య చేసుకోవడంపై అనుమానాలకు తావిస్తున్నాయి. ఉదయం రవళి తన తల్లి దండ్రులకు ఫోన్‌చేసి పుట్టినరోజు సందర్భంగా తమ గ్రామానికి గంభీర్‌పూర్ రావాలని కోరిందని తెలిపారు. సిద్దిపేట ఏసీపీ మధు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక సర్కారు దవాఖానకు తరలించినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.

దుబ్బాక మండలం గంభీర్‌పూర్‌లో ఆత్మహత్య చేసుకున్న రవళి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సిద్దిపేట ఏసీపీ మధు

తండాల్లో పడకేసిన పారిశుధ్యం

- పారిశుధ్య నిర్వహణ లోపించడంతో ఏరులై పారుతున్న మురుగు
- చెత్తాచెదారంతో కంపుకొడుతున్న తండాలు
- సీజనల్ వ్యాధులతో మంచాన పడుతున్న గిరిజనులు
- సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని 21 గిరిజన తండాల్లో అధ్వాన పరిస్థితి
- పట్టించుకోని ప్రత్యేకాధికారులు

సిద్దిపేట జిల్లా శిబ్బ తండాలో రోడ్డుపై పారుతున్న మురుగు

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 30: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని దుబ్బతండా, హనుమతండా, రెడ్యానాయక్ తండా, బెక్కల్, తోర్నాల పంచాయతీల పరిధిలో సుమారు 21 గిరిజన తండాలు ఉన్నాయి. ఈ తండాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. పారిశుధ్య నిర్వహణ లోపించడం వల్ల తండాల్లో మురుగు ఏరులై పారుతున్నది. చెత్తాచెదారంతో తండాల్లోని వీధులు నిండిపోయి కంపుకొడుతున్నాయి. తండాల్లో దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తుండడంతో గిరిజనులు మంచానపడుతున్నారు. డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులతో బాధపడుతున్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో పంచాయతీ అధికారులు పారిశుధ్య నిర్వహణను గాలికొదిలేశారు. దీనికితోడు మూడు గ్రామ పంచాయతీలకు కార్యదర్శులు కరువయ్యారు. ఇన్‌చార్జి కార్యదర్శులు చుట్టపుచూపుగా పంచాయతీలకు వచ్చిపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి పంచాయతీలకు కార్యదర్శులను నియమించడంతోపాటు తండాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని గిరిజనులు డిమాండ